# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 25 సెప్టెంబర్ 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 70

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




మార్కెట్ మాయ.. ఇన్వెస్టర్లకు షాక్!

## భూ ఆక్రమణలు నిగ్గు తేల్చేందుకు

# ప్రత్యేక కమిటీ

### కేసీఆర్.. కుటుంబ సభ్యుల భూములపై విచారణ

జాబితాలో కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్వర్‌రెడ్డి, గంగుల, పల్లా..

కమిటీ చైర్‌పర్సన్‌గా సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన

భూ అక్రమాలు, ఆక్రమణల నిగ్గు తేల్చేందుకు శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన మేరకు.. ప్రభుత్వం ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 16 అంశాలపై విచారణ చేయాలని నిర్ణయించింది.



హైదరాబాద్, సెప్టెంబర్ 24 : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, టి.హరీశ్‌రావులతోపాటు.. వారి కుటుంబ సభ్యులు, మరికొందరు భారాస నేతలకు సంబంధించి ఆయా గ్రామాల్లోనే భూముల వివరాలను విచారణ అంశాల్లో చేర్చింది. వారి అధీనంలోని భూముల్లో ప్రభుత్వ భూములు ఏ మేరకు ఉన్నాయి, ఎసైన్డ్, ఇతర భూముల ఆక్రమణలు, కొనుగోళ్లు జరిగాయన్న ఆరోపణల నిగ్గు తేల్చాలని విచారణ కమిటీకి నిర్దేశిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు ఉత్తర్వులు జారీచేశారు.

-మిగతా 2 లో..



## సీఎం రేవంత్ రెడ్డికి ప్రతిష్టాత్మక అవార్డు

'బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026'కు ఎంపిక

కేరళలో నేడు తెలంగాణ ముఖ్యమంత్రికి ప్రతిష్టాత్మక పురస్కారం

'ఆర్యదాన్ మహమ్మద్-2026' బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ పురస్కారానికి రేవంత్ రెడ్డి ఎంపిక

దివంగత కేరళ కాంగ్రెస్ నేత ఆర్యదాన్ మహమ్మద్ స్మారకంగా అవార్డు

హైదరాబాద్, సెప్టెంబర్ 24: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి మరో ప్రతిష్టాత్మక గుర్తింపు దక్కింది. కేరళకు చెందిన దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ఆర్యదాన్ మహమ్మద్ జ్ఞాపకార్థం అందించే "ఆర్యదాన్ మహమ్మద్-2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు"కు ఆయన ఎంపికయ్యారు. రైతులు, వెనుకబడిన తరగతులు, సాధారణ ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన

-మిగతా 2 లో..

## కోర్టుకెక్కిన 'క్షుద్రపూజల' వివాదం

### హరీశ్ రావుకు కీలక పరిణామం

మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్‌పై దాఖలు చేసిన క్రిమినల్ పరువునష్టం పిటిషన్లను న్యాయస్థానం స్వీకరించినట్లు హరీశ్ వెల్లడి

సెప్టెంబర్ 30న తన వాంగ్మూలాన్ని నమోదు చేసేందుకు కోర్టు అనుమతించిందని తెలిపిన మాజీ మంత్రి

దానం నాగేందర్ అనర్హత అంశంపైనా స్పందన.. పార్టీ మారిన ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని డిమాండ్



హైదరాబాద్, సెప్టెంబర్ 24 : రాజకీయ ఆరోపణలు ఇప్పుడు న్యాయస్థానం వరకు చేరాయి. తనపై 'క్షుద్రపూజలు' చేశారంటూ ప్రచారం చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌పై బీఆర్ఎస్ నేత హరీశ్ రావు దాఖలు చేసిన క్రిమినల్ పరువునష్టం పిటిషన్లను కోర్టు విచారణకు స్వీకరించిందని ఆయన వెల్లడించారు. నాంపల్లి కోర్టు వద్ద గురువారం మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. సెప్టెంబర్ 30న తన స్టేట్‌మెంట్‌ను నమోదు చేయడానికి న్యాయస్థానం అనుమతించినట్లు తెలిపారు. ఈ పరిణామాన్ని సంబంధిత కేసులో తదుపరి దశగా

-మిగతా 2 లో..



## దానం నాగేందర్‌పై

# అనర్హత కరెక్టే

### హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు

తీర్పుపై కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు.. రాహుల్, రేవంత్‌పై విమర్శలు

ఫిరాయింపుల అంశాన్ని మరోసారి తెరపైకి తెచ్చిన హరీశ్‌రావు

ఇతర పార్టీ మారిన ఎమ్మెల్యేలపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 : తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపుల వ్యవహారంపై సాగుతున్న న్యాయ-పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పుతో మరో కీలక మలుపు వచ్చింది. ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సర్వోన్నత న్యాయస్థానం గురువారం సమర్థించింది. హైకోర్టు నిర్ణయంలో జోక్యం చేసుకునే కారణం లేదంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పును రాజకీయంగా ప్రస్తావిస్తూ, పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో అధికార పార్టీ తీరుపై ప్రశ్నలు లేవనెత్తారు. దానం నాగేందర్ అనర్హత నుంచి బయటపడేందుకు చేసిన న్యాయపోరాటం

-మిగతా 2 లో..

గణేశ్ శోభాయాత్ర, సామూహిక నిమజ్జనానికి భాగ్యనగరం ముస్తాబైంది. రేపు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 26న ఉదయం 10 గంటల వరకు ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయి. అవసరమైతే టైమ్ పెంచే ఛాన్స్ ఉంది.





## గణపయ్య నిమజ్జనానికు

# సిటీ రెడీ..

- మెయిన్ రూట్లలో నో ఎంట్రీ..
- గల్లీ గల్లీకి డైవర్షన్లు.. ఓఆర్ఆర్ వైపే దారి!
- షీ టీమ్స్ ఫుల్ అలర్ట్.. పుకార్లపై ఉక్కుపాదం!

**బాలాపూర్ టు ఎన్టీఆర్ మార్గ్.. గణపయ్య జోరు!**

బాలాపూర్--చంద్రాయణగుట్ట--ఫలక్‌నుమా--చార్మినార్--అఫ్జల్‌గంజ్--ఎంజే మార్కెట్ మీదుగా ప్రధాన శోభాయాత్ర సాగనుంది. అబిడ్స్--బషీర్‌బాగ్--లిబర్టీ--అంబేద్కర్ విగ్రహం మీదుగా ఎన్టీఆర్ మార్గ్ వైపు విగ్రహాలు తరలించాలి. నిమజ్జన విగ్రహాల వాహనాలకు మాత్రమే ప్రధాన రూట్లలో అనుమతి ఉంటుంది. సాధారణ వాహనాలకు పూర్తిస్థాయి ఆంక్షలు.

**కార్లకు కటింగ్.. ఓఆర్ఆర్ కే గ్రీన్ సిగ్నల్!**

సైడ్ రోడ్లు, లేన్లపైనా బారికేడ్లు ఏర్పాటు చేశారు. వాహనదారులు ఇన్నర్ రింగ్ రోడ్, ఓఆర్ఆర్ మాసబ్‌ట్యాంక్--పంజాగుట్ట--బేగంపేట--సికింద్రాబాద్ మార్గాలను వినియోగించాలని పోలీసులు సూచించారు. చంద్రాయణగుట్ట, చార్మినార్, రాజేంద్రనగర్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్లలో పలు డైవర్షన్లు ఉంటాయి.

**ఎయిర్‌పోర్ట్.. రైల్వే ప్రయాణికులు అలర్ట్ !**

ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లేవారు పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే లేదా ఓఆర్ఆర్ ను ఎంచుకోవాలి. నెక్లెస్ రోడ్, ఎన్టీఆర్ మార్గ్, ట్యాంక్‌బండ్‌ను అవాయిడ్ చేయాలి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రయాణికులు బేగంపేట--ప్యారడైజ్--సంగీత్ రూట్‌లో వెళ్లాలని సూచించారు.

**షీ టీమ్స్ ఫుల్ అలర్ట్.. పుకార్లపై ఉక్కుపాదం!**

మహిళల భద్రత కోసం 26 షీ టీమ్స్ మూడు షిఫ్టుల్లో పనిచేస్తాయి. ఇప్పటివరకు 1,172 మంది ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సోషల్ మీడియాలో పుకార్లు, విద్వేష పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు.

## సీపీ సాబ్.. నోరు కాస్త కంట్రోల్‌లో పెట్టుకో!

కేసీఆర్ పాటలపై ఆంక్షలేంటి?.. సజ్జనార్‌పై కౌశిక్‌రెడ్డి కామెంట్స్

**హైదరాబాద్, సెప్టెంబర్ 24:**



హైదరాబాద్ సీపీ సీవీ సజ్జనార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నిమజ్జనాల్లో కేసీఆర్ పాటలు పెడితే కేసులు పెడతామనడం ఏంటని ప్రశ్నించారు. సజ్జనార్ తన నోరు అదుపులో పెట్టుకోవాలని వ్యాఖ్యానించారు. తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే సజ్జనార్‌ను వదిలిపెట్టబోమంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో చేశారు.గణేశ్ నిమజ్జనం ఏర్పాట్లపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూడా ఆయన విమర్శించారు. హుజురాబాద్‌లో విగ్రహాల నిమజ్జనానికి నీటి వసతి కల్పించాలని కోరినా స్పందించలేదని ఆరోపించారు.

# నేడూ భారీ వర్షాలు

### నిండుతున్న చెరువులు, కుంటలు..

అత్యధికంగా మధిర, భూపాలపల్లిలో 13 సెం.మీ. నమోదు

9 జిల్లాలకు ఆకస్మిక వరద ముప్పు ఉందని ఐఎండీ హెచ్చరిక



హైదరాబాద్, సెప్టెంబర్ 24 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. 24 గంటల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో సరాసరి 98.75 మి.మీ. వర్షపాతం నమోదైంది. రానున్న 24గంటల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఉమ్మడి కరీంనగర్‌తో పాటు మంచిర్యాల, కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి.

-మిగతా 2 లో..

వేగుచుక్క




# భూములు 22ఏలో ఉన్నా.. రిజిస్ట్రేషన్‌కు మార్గం..

(మొదటిపేజీ తరువాయి)

అనేక కాలనీల్లో స్థిరాస్తి లావాదేవీలు మళ్లీ కదలికలోకి వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లోని పలు హౌసింగ్ కాలనీల ప్రజలకు ఈ నిర్ణయం ప్రయోజనం చేకూర్చనుంది. ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలనుకునే ఆస్తి యజమానులు తమ వద్ద ఉన్న సంబంధిత అనుమతులు, హక్కు పత్రాలతో అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది. పత్రాల ఆధారంగా పరిశీలన పూర్తయిన తర్వాత ఆస్తిపై ఉన్న రిజిస్ట్రేషన్ పరిమితులను తొలగించే ప్రక్రియ చేపట్టాలని రెవెన్యూ శాఖ సూచించింది. అయితే 22ఏ వ్యవహారంలో జరిగిన అక్రమాలు, నిబంధనలకు విరుద్ధంగా చోటుచేసుకున్న పరిణామాలపై ప్రభుత్వం మరోవైపు విచారణకు సిద్ధమైంది. అసెంబ్లీలో ఈ అంశంపై చర్చ జరిగిన నేపథ్యంలో ప్రత్యేక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఈ కమిటీకి అధ్యక్షత వహించనున్నారు. రాజీవ్‌గాంధీ హనుమంతు, సందీప్‌కుమార్ ఝా సభ్యులుగా ఉండగా, సంబంధిత జిల్లాల కలెక్టర్లు కూడా కమిటీతో కలిసి పనిచేయనున్నారు. 22ఏ కింద భూములు, ఆస్తులు నిషేధిత జాబితాలోకి వెళ్లిన విధానం, అందులో చోటుచేసుకున్న అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై కమిటీ పరిశీలన చేయనుంది. ఈ విచారణ కేవలం 22ఏ అంశానికే పరిమితం కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఒకవైపు అర్హత కలిగిన ఆస్తులకు రిజిస్ట్రేషన్ మార్గం సులభతరం చేస్తూనే, మరోవైపు అక్రమాలపై విచారణకు చర్యలు చేపట్టడం ద్వారా ప్రభుత్వం రెండు దిశల్లో నిర్ణయాలు తీసుకుంది.

# కోర్టుకెక్కిన 'క్షుద్రపూజల' వివాదం..

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. తనపై చేసిన ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయని పేర్కొంటూ హరీశ్ రావు కోర్టును ఆశ్రయించారు. తనపై జరిగిన ప్రచారం వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉందన్నది ఆయన వాదన. ఈ మేరకు సంబంధిత ఆధారాలను కూడా సమర్పించినట్లు తెలిపారు. సెప్టెంబర్ 18న ఈ కేసుకు సంబంధించి నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో పిటిషన్లు దాఖలైనట్లు వార్తా నివేదికలు పేర్కొన్నాయి. ఈ వ్యవహారంపై మాట్లాడిన హరీశ్ రావు.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల నుంచి దృష్టిని మళ్లించేందుకే తనపై ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అసెంబ్లీకి డిప్యూటీ స్పీకర్‌ను నియమించకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. సభా హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన నోటీసుల విషయంలోనూ స్పీకర్ స్పందించడం లేదని విమర్శించారు. ఇవన్నీ తన రాజకీయ అభిప్రాయాలు, ఆరోపణలేనని గమనించాలి.

### దానం నాగేందర్ అంశంపైనా హరీశ్ స్పందన

ఇదే సందర్భంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంపై కూడా హరీశ్ రావు మాట్లాడారు. పార్టీ ఫిరాయింపుల కేసులో దానం నాగేందర్ అనర్హతపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సెప్టెంబర్ 24న సమర్థించింది. దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించినట్లు పలు తాజా నివేదికలు వెల్లడించాయి. ఈ తీర్పుపై స్పందించిన హరీశ్ రావు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేశారు. కాంగ్రెస్‌లో చేరిన ఇతర పార్టీ ఎమ్మెల్యేలతోనూ రాజీనామా చేయించి ప్రజా తీర్పును కోరాలని రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు. పార్టీ ఫిరాయింపుల అంశంలో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మిగతా ఎమ్మెల్యేల విషయంలోనూ ఇదే అంశం రాజకీయ చర్చకు వస్తోందని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా, ఒకవైపు తనపై వచ్చిన 'క్షుద్రపూజల' ఆరోపణలను న్యాయస్థానంలో ఎదుర్కొనేందుకు హరీశ్ రావు సిద్ధమవుతుండగా.. మరోవైపు దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టు తీర్పును ఆధారంగా చేసుకుని పార్టీ ఫిరాయింపుల అంశాన్ని రాజకీయంగా ప్రస్తావించారు. సెప్టెంబర్ 30న హరీశ్ రావు వాంగ్మూలం నమోదు కానుండటంతో పరువునష్టం కేసు తదుపరి పరిణామాలపై ఆసక్తి నెలకొంది.



# ప్రణయ్ పరువు హత్యకేసు..

## చర్లపల్లి జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ మృతి

**హైదరాబాద్:** ప్రేమ వివాహం చేసుకున్న నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ప్రణయ్ హత్య కేసు(గ్రాతీఖుఅఖుఎ ఎబతీసవతీ ఞంవ)లో జీవితఖైదు అనుభవిస్తున్న అబ్దుల్ బారీ (50) చర్లపల్లి జైలులో గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం మధ్యాహ్నం 3గంటల సమయంలో గుండెపోటు రావడంతో జైలు సిబ్బంది వెంటనే సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అబ్దుల్ బారీ మృతి చెందాడు. 2018 సెప్టెంబర్ 14న నల్గొండ జిల్లా మిర్యాలగూడలో సంచలనం సృష్టించిన పెరుమాళ్ల ప్రణయ్ పరువు హత్య కేసులో బారీ నాల్గో నిందితుడు. గుజరాత్‌కు చెందిన మాజీ హోంమంత్రి హరేన్ పాండ్యా హత్య కేసులోనూ అబ్దుల్ బారీ నిందితుడిగా ఉన్నాడు. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన, నల్గొండ జిల్లా మిర్యాలగూడలో 2018లో జరిగిన పెరుమాళ్ల ప్రణయ్‌కుమార్ పరువు హత్య కేసులో ఒకరికి ఉరిశిక్ష, మరో ఆరుగురికి జీవితఖైదు విధిస్తూ నల్గొండ ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానం, రెండో అదనపు సెషన్స్ జిల్లా కోర్టు గతేడాది మార్చిలో సంచలన తీర్పు ఇచ్చింది. ఈ కేసులో ప్రథమ ముద్దాయి తిరునగరు మారుతీరావు... 2020లో హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో అతనిపై విచారణను న్యాయస్థానం అప్పుడే నిలిపివేసింది. ఐదేళ్ల తొమ్మిదినెలల సుదీర్ఘ విచారణ తర్వాత.. హత్యలో కీలక పాత్రధారి సుభాష్‌కుమార్‌శర్మకు ఉరిశిక్ష, ఏ3: అస్గర్ అలీ, ఏ4: అబ్దుల్ బారీ, ఏ5: అబ్దుల్ కరీం, ఏ6: శ్రవణ్‌కుమార్ (మారుతీరావు తమ్ముడు), ఏ7: శివ (మారుతీరావు కారుడ్రైవర్), ఏ8: నిజాం (ఆటోడ్రైవర్)కు జీవిత ఖైదు విధిస్తూ న్యాయస్థానం అప్పట్లో తీర్పు ఇచ్చింది.

# దానం నాగేందర్‌పై అనర్హత కరెక్టే

(మొదటిపేజీ తరువాయి)

విఫలమైందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజల తీర్పుతో గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీ మారిన తర్వాత కూడా పదవుల్లో కొనసాగేందుకు ప్రయత్నించడాన్ని ఆయన తప్పుబట్టారు. రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి స్పీకర్ వ్యవస్థను ఆధారంగా చేసుకుని ఫిరాయింపుల అంశాన్ని అధిగమించవచ్చని భావించారని కేటీఆర్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో స్పీకర్ కార్యాలయాన్ని అడ్డుపెట్టుకుని ఫిరాయింపులను ప్రోత్సహించే ప్రయత్నాలు జరిగాయని ఆయన విమర్శించారు. కేటీఆర్ తన ఎక్స్ పోస్టులో సుప్రీంకోర్టు తీర్పును రాహుల్, రేవంత్‌కు "సుప్రీం చెంపపెట్టు"గా అభివర్ణించారు.





### ఖైరతాబాద్ ఉప ఎన్నికపైనా కేటీఆర్ వ్యాఖ్యలు

దానం నాగేందర్ అనర్హత నేపథ్యంలో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు హైకోర్టు తీర్పులో పేర్కొనగా, సుప్రీంకోర్టు కూడా ఆ నిర్ణయంలో జోక్యం చేసుకోలేదు. ఈ నేపథ్యంలో రాబోయే ఖైరతాబాద్ ఉప ఎన్నికను ప్రస్తావిస్తూ కేటీఆర్ కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. ప్రజలు తమ తీర్పుతో స్పందిస్తారని ఆయన వ్యాఖ్యానించారు. "ఒక వికెట్ పడింది.. త్వరలో మరిన్ని పడతాయి" అంటూ ఇతర ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశాన్ని కూడా ప్రస్తావించారు.

### హరీశ్‌రావు డిమాండ్ ఏంటంటే..

సుప్రీంకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ శాసనసభ ఉప నాయకుడు హరీశ్‌రావు కూడా స్పందించారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ.. పార్టీ ఫిరాయింపుల విషయంలో భిన్నంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. రాహుల్ గాంధీ నిజంగా రాజ్యాంగ విలువలకు ప్రాధాన్యత ఇస్తే.. కాంగ్రెస్‌లో చేరిన ఇతర ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి మళ్లీ ప్రజల తీర్పు కోరాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఢిల్లీలో రాజ్యాంగ నైతికత గురించి మాట్లాడి, తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అంశంపై మౌనం వహించడం సరికాదని ఆయన వ్యాఖ్యానించారు.

### ఫిరాయింపుల అంశంపై మళ్లీ రాజకీయ వేడి

దానం నాగేందర్ వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పుతో ఖైరతాబాద్ స్థానంపై తదుపరి రాజకీయ పరిణామాలపై దృష్టి పడింది. అదే సమయంలో ఈ తీర్పును బీఆర్ఎస్ నేతలు రాష్ట్రంలోని ఇతర పార్టీ మారిన ఎమ్మెల్యేల అంశంతో ముడిపెడుతున్నారు. కాగా, దానం నాగేందర్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి గెలిచారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరి 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ పరిణామాల ఆధారంగా తెలంగాణ హైకోర్టు ఆయనను అనర్హుడిగా ప్రకటించగా, తాజాగా సుప్రీంకోర్టు కూడా ఆ నిర్ణయంలో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. దీంతో తెలంగాణలో పార్టీ ఫిరాయింపులపై కొనసాగుతున్న రాజకీయ చర్చ మరోసారి వేడెక్కింది. బీఆర్ఎస్ నేతల తాజా వ్యాఖ్యలతో ఈ అంశం ఇకపై రాజకీయంగానూ మరింత ప్రాధాన్యం సంతరించుకునే పరిస్థితి కనిపిస్తోంది.

# సీఎం రేవంత్ రెడ్డికి ప్రతిష్ఠాత్మక అవార్డు..

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమాలతో పాటు ఆయన నాయకత్వాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆర్యదాన్ మహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని ఇవాళ కేరళలోని నిలంబూరులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి అవార్డును అందజేయనున్నారు. పురస్కారంలో రూ.లక్ష నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపిక కూడా ఉన్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.




### ఏ అంశాలను పరిగణనలోకి తీసుకున్నారంటే..

తెలంగాణలో రైతులు, బీసీలు, సామాన్య ప్రజల సంక్షేమానికి సంబంధించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన వినూత్న కార్యక్రమాలను అవార్డు ఎంపిక కమిటీ పరిగణనలోకి తీసుకున్నట్లు ఆర్యదాన్ మహమ్మద్ ఫౌండేషన్ తెలిపింది. ముఖ్యమంత్రి నాయకత్వంతో పాటు ప్రజాస్వామిక విలువల పట్ల ఆయన చూపుతున్న నిబద్ధతను కూడా జ్యూరీ ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఈ అవార్డు ఎంపిక ప్రక్రియలో ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ మంత్రి ఏపీ అనిల్ కుమార్, ప్రముఖ మేధావి కల్పెట్ట నారాయణన్ జ్యూరీ సభ్యులుగా వ్యవహరించినట్లు సమాచారం.

### ఆర్యదాన్ మహమ్మద్ పేరుతో..

కేరళకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆర్యదాన్ మహమ్మద్ స్మారకంగా ఈ పురస్కారాన్ని ఆర్యదాన్ మహమ్మద్ ఫౌండేషన్ ఏర్పాటు చేసింది. ఆయన కేరళ అసెంబ్లీకి ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, రాష్ట్ర ప్రభుత్వాల్లో నాలుగుసార్లు మంత్రిగా వివిధ శాఖలు నిర్వహించారు. ఆయన నాలుగో వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న స్మారక కార్యక్రమంలోనే రేవంత్ రెడ్డికి ఈ ఏడాది పురస్కారం అందించనున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) కేసీ వేణుగోపాల్ ఆర్యదాన్ మహమ్మద్ స్మారక ఉపన్యాసం ఇవ్వనున్నారు.

# భూ ఆక్రమణలు నిగ్గు తేల్చేందుకు ప్రత్యేక కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

బుధవారం జారీ అయిన ఈ జీవో.. గురువారం వెలుగులోకి వచ్చింది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఎ.శ్రీదేవసేనను కమిటీ ఛైర్‌పర్సన్‌గా నియమించారు. స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతోపాటు.. ఆయా భూములున్న జిల్లాకు చెందిన కలెక్టర్ సభ్యులుగా ఉంటారు. తుది నివేదిక ఇచ్చేలోగా అంశాల తీవ్రతను బట్టి మధ్యంతర నివేదికలను సమర్పించాలంటూ ప్రభుత్వం ఆదేశించింది. సిద్దిపేట, రంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల్లో క్షేత్రస్థాయి విచారణను ఈ కమిటీ చేపట్టనుంది.



# ఖైరతాబాద్ నా అడ్డా..

(మొదటిపేజీ తరువాయి)

గురువారం డిస్మిస్ చేసింది. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ మీడియాతో మాట్లాడారు. "ఎంపీగా పోటీ చేసినప్పుడే ఊహించా.. అదే జరిగింది. లీగల్‌గా పోరాడటంలో తప్పులేదు. పదో షెడ్యూల్ ప్రకారం రిలీఫ్ దొరుకుతుందని అనుకున్నా. మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు చెప్పింది. నేను ప్రతి ఇంటికి వెళ్లి సేవ చేశా.. నేనేంటో ప్రజలను అడిగితే తెలుస్తుంది. ఉప ఎన్నికలో పోటీపై సీఎం స్పష్టత ఇస్తారు. గతంలో మూడుసార్లు గెలిచాను. ఒక ఉప ఎన్నికలో 1,600 ఓట్లతో ఓడిపోయాను. ఇప్పుడు పరిస్థితులు చాలా అనుకూలంగా ఉన్నాయి. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక ఫలితాలే ఇక్కడా రిపీట్ అవుతాయి. ఖైరతాబాద్ దానం నాగేందర్ అడ్డా. కలిసి పనిచేస్తాం.. తప్పకుండా గెలుస్తాం" అని దానం నాగేందర్ అన్నారు.

# 1న మంత్రివర్గ సమావేశం

హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలో వచ్చే నెల 1న సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. ఇందులో పలు అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. పలుశాఖల్లో కొత్త పోస్టుల మంజూరు, పరిశ్రమల అవసరాలకు భూముల కేటాయింపు తదితర అంశాలపై మంత్రిమండలి చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఎల్‌నినోతో వర్షాభావ పరిస్థితులు, సాగునీటి ప్రాజెక్టులు, విద్యుత్ సరఫరాకు సత్వర చర్యలు, 22ఏపై కమిటీల ఏర్పాటు, డిసెంబరులో నిర్వహించనున్న గ్లోబల్ సమిట్ ప్రోగ్రెస్ అంశాలపై క్యాబినెట్‌లో నిర్ణయాలు తీసుకోనున్నట్లు సమాచారం.

# నేడూ భారీ వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

బలమైన గాలుల కారణంగా కోతకు వచ్చిన వరి పైరు నేలకొరిగింది. పలు చోట్ల చెట్లు నేలకూలి, రవాణా, విద్యుత్ సరఫరాలకు అంతరాయం ఏర్పడింది. కుమరంభీం ప్రాజెక్టులోకి 5,139 క్యూసెక్కుల వరదనీరు, వట్టివాగు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 1,800 క్యూసెక్కులు ఉంది. పెద్దవాగు పరివాహక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ముసురుతో కూడిన వానతో పంటలకు ఊపిరి పోసినట్లయింది. సూర్యాపేట జిల్లాలో 10గంటల పాటు కురిసిన వర్షానికి చెరువుల్లోకి నీరు వచ్చింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో భారీ నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. మూసీ నది పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు దిగువన మూసీ రిజర్వాయర్‌కు 460.55క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. 645అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం గురువారం సాయంత్రానికి 641.60అడుగులు(3.35టీఎంసీలు)గా ఉంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వకు 591.74క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎడతెరిపిలేకుండా వర్షం పడింది. మున్నేరు, ఆకేరు తదితర ఏర్లు, వాగుల్లో జలకళ కనిపిస్తోంది. జిల్లాలో 1.30 సెం.మీ సగటు వర్షపాతం నమోదైది. వైరా రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టాన్ని దాటింది. ఐదు అలుగుల నుంచి వరదనీరు దిగువకు ప్రవహిస్తోంది. అశ్వరావుపేట మండలంలోని పెదవాగు ప్రాజెక్టుకు భారీగా వరద చేరడంతో 6,800 క్యూసెక్కుల వరద దిగువకు వదిలారు. ములకలపల్లి మండలం మూకమామిడి ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద పోటెత్తడంతో మత్తడి పోసింది. కిన్నెరసాని పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరదకు 405.60 అడుగులకు చేరింది. చర్ల మండంలోని తాలిపేరు ప్రాజెక్టుకు ఛత్తీసగఢ్ అటవీప్రాంతం నుంచి వరద వస్తుండటంతో 8గేట్లు ఎత్తి 10వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. భద్రాచలం వద్ద గోదావరి 16.80 అడుగుల వద్ద కొనసాగుతుండగా 1.23 క్యూసెక్కుల వరద ఫ్లో ఉంది. వానల కారణంగా సింగరేణి రీజియన్ పరిధిలోని కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు, సత్తుపల్లిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. నల్లమల అటవీ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు శ్రీశైలం ఘాట్ రోడ్డుపై కొండ చరియలు విరిగిపడ్డాయి. ఆ సమయంలో ఎటువంటి వాహనాల రాకపోకలు, జనసంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది.



# ఇంధన పొదుపే భవిష్యత్తుకు పునాది.





## సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య.

## పాఠశాలలో ఇంధన సంరక్షణపై చిత్రలేఖన పోటీ.

**వేగుచుక్క న్యూస్, సిరికొండ:**

భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖకు చెందిన శక్తి సామర్థ్య బ్యూరో (బిఇఇ) మరియు నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్టిపిసి) వారి ఆదేశాల మేరకు, జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వుల ప్రకారం విద్యార్థుల్లో ఇంధన పరిరక్షణపై అవగాహన పెంపొందించే ఉద్దేశంతో గురువారం సత్యశోధక్ పాఠశాలలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు 6,7,8 తరగతుల విద్యార్థులకు "పాఠశాలలో – ఇంటిలో ఇంధనాన్ని ఆదా చేద్దాం" మరియు 9,10 తరగతుల విద్యార్థులకు "ఇంధన సంరక్షణే ఇంధన భద్రతకు కీలకం" అనే అంశాలపై విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. విద్యార్థులు ఇంధనాన్ని వృథా చేయకుండా వినియోగించడం, విద్యుత్ పొదుపు, పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ తరాలకు ఇంధన భద్రత వంటి అంశాలను తమ చిత్రాల్లో చక్కగా ప్రతిబింబించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య మాట్లాడుతూ, చిన్న వయస్సు నుంచే విద్యార్థుల్లో ఇంధన పొదుపు అలవాట్లను పెంపొందించడం ద్వారా బాధ్యతాయుతమైన పౌరులను తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. ఈ చిత్రలేఖన పోటీ ప్రధాన ఉద్దేశం విద్యార్థుల్లో అవగాహనతో పాటు సామాజిక బాధ్యతా భావాన్ని పెంపొందించడమేనని, "ఇంధనాన్ని పొదుపు చేద్దాం – భవిష్యత్తును కాపాడుకుందాం" అనే భావనను విద్యార్థుల్లో నింపడమే లక్ష్యమని తెలియ పరిచడమైనది. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఉత్తమ చిత్రాలు గీసిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య బహుమతులు అందజేసి అభినందించారు. రెండు విభాగాలలో ఎంపికైన ఉత్తమ చిత్రాలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎన్టిపిసి కార్యాలయానికి పంపడమైనది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# సత్యశోధక్ సమాజ్ స్ఫూర్తితో.. కుల నిర్మూలన కోసం పోరాడుదాం.

**కులాంతర వివాహాలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి.**

**సీఎల్పీ జిల్లా కార్యదర్శి ఆల్గోట్ రవీందర్, మాస్ లైన్ పార్టీ నగర కార్యదర్శి ఎం.సుధాకర్.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

సత్యశోధక్ సమాజ్ స్ఫూర్తితో కుల నిర్మూలన కోసం పోరాడుదాం అని, కులాంతర వివాహాలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలనీ సీఎల్పీ జిల్లా కార్యదర్శి ఆల్గోట్ రవీందర్, మాస్ లైన్ పార్టీ నగర కార్యదర్శి ఎం.సుధాకర్ లు పిలుపునిచ్చారు. మహాత్మ జ్యోతిభాపూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 153వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) పార్టీ ఆధ్వర్యంలో "కుల నిర్మూలన సదస్సు"ను కోటగల్లీలోని ఎన్.ఆర్ భవన్ లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎల్పీ జిల్లా కార్యదర్శి ఆల్గోట్ రవీందర్, మాస్ లైన్ పార్టీ నగర కార్యదర్శి ఎం.సుధాకర్ లు మాట్లాడుతూ... మహాత్మ జ్యోతిభాపూలే కుల వ్యవస్థకు వ్యతిరేకంగాను, దాని నిర్మలనా లక్ష్యంగాను 1873 సెప్టెంబర్ 24న సత్యశోధక్ సమాజ్ ను ఏర్పరిచారన్నారు. మన దేశంలో కుల వ్యవస్థ సామాజిక ప్రజాస్వామ్యానికి, రాజకీయ ప్రజాస్వామ్యానికి ప్రత్యక్షంగా వ్యతిరేకంగానూ, ఆటంకంగాను ఉన్నదన్నారు. కులాంతర వివాహాల వల్లనే కుల నిర్మూలన లక్ష్యం సాకారమౌతుందన్నారు. కులాంతర, మతాంతర, ప్రేమ వివాహాలను ప్రభుత్వాలు, పౌర సమాజం ప్రోత్సహించాలన్నారు. కులాంతర, ప్రేమ వివాహాలు చేసుకున్న వారిపై పరువు పేరుతో హత్యలు, దాడులు చేయడం గత 13 సంవత్సరాలుగా తీవ్రమైందన్నారు. ఎందుకు ఆర్ఎస్ఎస్, బిజెపి శక్తుల కుల, మతోన్మాద రాజకీయాలే కారణమన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు రక్షణ కరువైందన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ప్రోత్సాహకాలు అందించడంలో పాలకవర్గాలు తీవ్రమైన జాప్యాన్ని ప్రదర్శిస్తున్నాయని ఆరోపించారు. కులాంతర, మతాంతర, ప్రేమ వివాహాలు చేసుకున్న జంటలకు ప్రభుత్వం, పోలీసులు రక్షణ కల్పించాలని, కనీసం 10 లక్షల రూపాయలు ప్రోత్సాహకం అందించాలని, ఉపాధి మార్గాలను చూపించాలని డిమాండ్ చేశారు. పరువు హత్యలు, దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

మహాత్మ జ్యోతిబాపూలే ఏ లక్ష్యం కోసం సత్యశోధక్ సమాజ్ ను ఏర్పాటు చేశారో, ఆ లక్ష్యం కోసం పనిచేయాల్సిన కర్తవ్యం ప్రస్తుతం మరింత పెరిగిందన్నారు. సత్యశోధక్ సమాజ్ స్ఫూర్తితో కుల నిర్మూలన కోసం మరింత చైతన్యవంతంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు డి.కిషన్, బి.మురళి, డివిజన్ నాయకులు గంగమల్లు, పీవోడబ్ల్యు జిల్లా కార్యదర్శి కే.సంధ్యారాణి, పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే.గణేష్, ఎల్.అనిల్, నాయకులు లింగం, భాస్కర స్వామి, నసీర్, అమూల్య, సృజన్, మనితేజ, మమత, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి: డా. ప్రగతి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**



విద్యార్థులు భగత్ సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలనీ, సమాజంలోని సమస్యలపై పోరాడాలని పిడిఎస్ యు మాజీ నాయకురాలు డా. ప్రగతి పిలుపునిచ్చారు. భారత స్వాతంత్ర్య ఉద్యమ వీర కిషోరం కామ్రేడ్ భగత్ సింగ్ జయంతి సందర్భంగా నిజామాబాద్ నగరంలోని చంద్రశేఖర్ కాలనీ ఎస్సీ బాలికల హాస్టల్‌లో పీడిఎస్ యు ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా మాజీ పీడిఎస్ యు జిల్లా కార్యదర్శి, లెక్చరర్ డా. ప్రగతి హాజరై విద్యార్థినులనుద్దేశించి మాట్లాడారు. భగత్ సింగ్ జీవితం, ఆయన పోరాట స్ఫూర్తి, సమాజం పట్ల ఆయనకున్న బాధ్యతను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

భగత్ సింగ్ చిన్న వయసులోనే దేశంలోని సామాజిక పరిస్థితులను లోతుగా అధ్యయనం చేసి, అన్యాయం, దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా ప్రశ్నించే ధైర్యాన్ని పెంపొందించుకున్నారని తెలిపారు. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సమాజాన్ని అధ్యయనం చేయాలని, తమ చుట్టూ జరుగుతున్న పరిణామాలను అర్థం చేసుకోవాలని, అన్యాయం జరిగినప్పుడు ప్రశ్నించే చైతన్యాన్ని పెంచుకోవాలని సూచించారు.

విద్య అనేది కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాకుండా సమాజాన్ని అర్థం చేసుకునే జ్ఞానాన్ని, మంచి చెడులను విశ్లేషించే ఆలోచనా శక్తిని పెంపొందించేదిగా ఉండాలని అన్నారు. భగత్ సింగ్ జీవితంలో అధ్యయనం, ఆలోచన, ప్రశ్నించడం, ప్రజల కోసం నిలబడటం ఎంతో ముఖ్యమైనవని పేర్కొన్నారు.

ప్రస్తుత విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకుని, మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని, సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యతను అలవర్చుకుంటేనే సమాజంలో మంచి మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. భగత్ సింగ్‌ను కేవలం జయంతి రోజున స్మరించుకోవడం కాకుండా,

ఆయన ఆశయాలను అధ్యయనం చేసి, ఆయనలోని ప్రశ్నించే తత్వాన్ని మరియు సామాజిక చైతన్యాన్ని విద్యార్థులు తమ జీవితంలో ఆచరించాలని డా. ప్రగతి పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో పీడిఎస్ యు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కర్క గణేష్, ఎల్. అనిల్ కుమార్, నగర అధ్యక్ష కార్యదర్శులు ఎండి. నసీర్ , ఆల్గోట్ సృజన్, హాస్టల్ వార్డెన్ సుజన, నాయకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొని భగత్ సింగ్‌కు ఘనంగా నివాళులర్పించారు.

# మార్కెట్ మాయ.. ఇన్వెస్టర్లకు షాక్!

**వెబ్ డెస్క్, సెప్టెంబర్ 24:**



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీగా పతనమయ్యాయి. పెరుగుతున్న క్రూడ్ ఆయిల్ ధరలు, గ్లోబల్ బాండ్ మార్కెట్లలో అమ్మకాలతో ఇన్వెస్టర్లు రిస్క్ తీసుకునేందుకు వెనకాడారు. దీంతో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లలో సేల్-ఆఫ్ జోరందుకుంది. సెన్సెక్స్ 1,247.71 పాయింట్లు కోల్పోయి 73,580.54 వద్ద, నిఫ్టీ 383.70 పాయింట్లు పడి 23,063.10 వద్ద క్లోజైంది. మిడ్‌క్యాప్ 2.25%, స్మాల్‌క్యాప్ 1.53% నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు భారీగా పడిపోయాయి. నిఫ్టీకి 23,000 కీలక స్థాయిగా మారింది.






# గణనాథుడికి "డాక్టర్ కృష్ణ కిషోర్ రెడ్డి" ప్రత్యేక పూజలు.





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

నగరంలోని ఖలీల్ వాడి, పోచమ్మ గల్లీలో కొలువుదీరిన గణనాథుడిని ప్రముఖ చెస్ట్ అండ్ అలెర్జీ వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణ కిషోర్ రెడ్డి గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తులకు తన చేతుల మీదుగా అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మహిపాల్ రెడ్డి, గణేష్ యువజన సంఘం సభ్యులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణ కిషోర్ రెడ్డి మాట్లాడుతూ...**

"విఘ్నాలను తొలగించే వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నాను. గణేష్ ఉత్సవాలు మనలో ఐక్యతను, భక్తి భావాన్ని పెంపొందిస్తాయి. ఖలీల్ వాడి గణేష్ యువజన సంఘం సభ్యులు ప్రతి ఏటా ఎంతో భక్తి శ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయం" అని అన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.





# నానిపై భార్య అంజనా భావోద్వేగ వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబరు 24 :

నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటించిన 'ది ప్యారడైజ్' చిత్రం భారీ అంచనాల మధ్య విడుదలైన వేళ, ఆయన భార్య అంజనా సామాజిక మాధ్యమాలో పంచుకున్న భావోద్వేగ సందేశం అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. నాని సినీ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ.. 2009లో ఆయన ప్రారంభ రోజుల్లో ఒక సినిమా చూసేందుకు వెళ్లగా, విడుదల రోజే ఉదయం ప్రదర్శన కూడా పడలేదని, పరిశ్రమలోకి కొత్తగా వచ్చిన ఒక నటుడి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం ఎంత కష్టమో అప్పుడే తనకు అర్థమైందని ఆమె పేర్కొన్నారు. అయితే సరిగ్గా 17 ఏళ్ల తర్వాత నాని సినిమా అనగానే ప్రేక్షకులు థియేటర్లకు తరలిరావడానికి కారణం ఆయనపై ఉన్న నమ్మకమేనని, ఈ స్థాయి వెనుక ఎన్నో ఏళ్ల కష్టం, పట్టుదల ఉన్నాయని అంజనా తెలిపారు. ప్రతి సినిమాను తన బిడ్డలా భావించే నాని సినీ ప్రయాణానికి తాను ప్రత్యక్ష సాక్షినని, కుటుంబంగా ఎప్పుడూ ఆయనకు అండగా ఉంటామని ఆమె స్పష్టం చేశారు. మరోవైపు 'ది ప్యారడైజ్' చిత్రబృందానికి మెగాస్టార్ చిరంజీవి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. నానిలోని ఉత్సాహం, నటనలో నిజాయితీ, కొత్తగా ఏదైనా చేయాలనే తపన తనను ఎప్పుడూ ఆకట్టుకుంటాయని ఆయన కొనియాడారు. 'దసరా' తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త మైలురాళ్లను అందుకోవాలని ఆకాంక్షిస్తూ మొత్తం చిత్రబృందానికి తన ఆశీస్సులు అందించారు.



# 'జార్జ్ క్రిష్'లో మానస వారణాసి

హైదరాబాద్, సెప్టెంబరు 24 :

హీరో శర్వానంద్, దర్శకుడు శ్రీను వైట్ల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'జార్జ్ క్రిష్'. ఈ సినిమాలో కథానాయికగా మానస వారణాసిని ఎంపిక చేసినట్లు చిత్రబృందం ప్రకటించింది. శర్వానంద్‌కు జోడీగా ఆమె కనిపించనున్నారు. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో ఇటీవల గుర్తింపు తెచ్చుకున్న మానస.. తన నటనతో ప్రశంసలు అందుకున్నారు. 'జార్జ్ క్రిష్'లో ఆమె పాత్రకు ప్రాధాన్యం ఉంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. శర్వానంద్, శ్రీను వైట్ల తొలిసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ సినిమాపై మొదటి నుంచే ఆసక్తి నెలకొంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై అనిల్ సుంకర సమర్పణలో రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. అజయ్ సుంకర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సంక్రాంతి కానుకగా సినిమాను విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. శర్వానంద్‌కు సంక్రాంతి సెంటిమెంట్ ఉండటంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఇటీవలే పూజా కార్యక్రమాలతో సినిమా ప్రారంభమైంది.

# రామ్ చరణ్ - సుకుమార్ చిత్రం పూజా కార్యక్రమాలకు ముహూర్తం

హైదరాబాద్, సెప్టెంబరు 24 :

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, స్టార్ దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రానున్న ః=జ17ః చిత్రంపై టాలీవుడ్‌లో సరికొత్త ఊహాగానాలు, అంచనాలు నెలకొన్నాయి. 'రంగస్థలం' వంటి సంచలన విజయం తర్వాత వీరిద్దరి కలయికలో తెరకెక్కుతున్న ఈ చిత్రం పూజా కార్యక్రమాలను విజయాదశమి (దసరా) పండగ సందర్భంగా అక్టోబర్ 20న వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ వేడుక అనంతరం నవంబర్ నుంచి నిరంతర చిత్రీకరణ (రెగ్యులర్ షూటింగ్) ప్రారంభించాలని సుకుమార్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నా రు. ఈ ప్రాజెక్ట్ కోసం రామ్ చరణ్ ప్రత్యేకంగా మేకోవర్ అవుతున్నారు. 'పెద్ది' చిత్రం తర్వాత సుకుమార్ పాత్రకు అనుగుణంగా ఆయన బరువు తగ్గి మరింత సన్నగా మారుతున్నారు. ఇటీవ ల



బేగంపేట విమానాశ్రయంలో ఆయన సరికొత్త రూపంలో కనిపించడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.

# 'ది ప్యారడైజ్' ఘనంగా విడుదల

హైదరాబాద్, సెప్టెంబరు 24 :

నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా, ప్రతిభావంతుడైన దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కిన అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం 'ది ప్యారడైజ్' సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఘనంగా విడుదలైంది. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'దసరా' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించడంతో, ఈ నయా చిత్రంపై మొదటి నుంచే సినీ వర్గాల్లోనూ, ప్రేక్షకుల్లోనూ తీవ్ర స్థాయి అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం విడుదలకు ముందే ముందస్తు టికెట్ విక్రయాల్లో సరికొత్త రికార్డులను సృష్టించింది. బుక్‌మైషో మరియు డిస్ట్రిక్ట్ వంటి అంతర్జాల వేదికల ద్వారా 15 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా వెల్లడించింది. తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల్లోనూ ముందస్తు ప్రదర్శనలకు అనూహ్య




స్పందన లభించడంతో థియేటర్ల వద్ద పండుగ వాతావరణం నెలకొంది. ఈ చిత్రంలో నాని 'జడల్' అనే అత్యంత శక్తివంతమైన, విభిన్నమైన పాత్రలో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. కథానాయికగా కయాదు లోహర్ నటించగా, సీనియర్ నటుడు మోహన్ బాబు, రాఘవ్ జుయల్, తనికెళ్ల భరణి, సోనాలి కులకర్ణి కీలక పాత్రలు పోషించారు. స్వరకర్త అనిరుధ్ రవిచందర్ అందించిన నేపథ్య సంగీతం, శ్రీకాంత్ ఓదెల మార్క్ భావోద్వేగాలు, భారీ యాక్షన్ సన్నివేశాలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ చిత్రం తొలిరోజే భారీ వసూళ్లను సాధించే దిశగా దూసుకుపోతోంది.

# గుండెనిండా గుడిగంటలు అమూల్య గౌడ సందడి

హైదరాబాద్, సెప్టెంబరు 24 :

తెలుగు బుల్లితెరపై ప్రసారమయ్యే ధారావాహికలు, వాటిలోని నటీనటులు వెండితెర తారల స్థాయిలో విశేష ఆదరణ సొంతం చేసుకుంటున్నారు. ప్రస్తుతం 'స్టార్ మా' వేదికగా ప్రసారమవుతున్న ప్రముఖ ధారావాహిక 'గుండెనిండా గుడిగంటలు'లో 'మీనా' అనే పాత్రలో నటిస్తూ కన్నడ నటి అమూల్య గౌడ తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు. కుటుంబ విలువలకు ప్రాధాన్యతనిచ్చే అమాయకపు అమ్మాయిగా భావోద్వేగ సన్నివేశాల్లో సహజ నటనను కనబరుస్తూ ఆమె మంచి ప్రజాదరణ పొందారు. గతంలో కన్నడ సీరియల్ 'శ్రీగౌరీ' ద్వారా నటనా ప్రయాణాన్ని ప్రారంభించి, అక్కడ 'బిగ్ బాస్' రియాలిటీ కార్యక్రమంలోనూ పాల్గొని అమూల్య మంచి పేరు సంపాదించుకున్నారు. ధారావాహికలో సాంప్రదాయ చీరకట్టులో కనిపించే ఈ నటి, సామాజిక మాధ్యమాలో మాత్రం ఆధునిక దుస్తులతో కూడిన విభిన్న రూపాలతో (స్టైలిష్ లుక్స్) నెటిజన్లను ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఈమెకు అంతర్జాలంలో 5 లక్షలకు పైగా అనుచరులు (ఫాలోవర్లు) ఉండగా, ఆమె పంచుకునే చిత్రాలు సామాజిక మాధ్యమాలో విశేషంగా వైరల్ అవుతున్నాయి.





# వివాహం మాతృత్వంపై శ్రుతిహాసన్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబరు 24 :

సినీ పరిశ్రమలో నటిగా, గాయనిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు కమల్ హాసన్ కుమార్తె శ్రుతిహాసన్ వివాహం, మాతృత్వంపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం అంతర్జాలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. దక్షిణాది చలనచిత్ర పరిశ్రమతో పాటు ఉత్తరాది సినిమాల్లోనూ నటిస్తూ పాన్ ఇండియా స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ నటి, ఇటీవల బాలీవుడ్ నటి సోహా అలీఖాన్ నిర్వహించిన ఒక ప్రత్యేక సంభాషణ కార్యక్రమంలో పాల్గొని తన వ్యక్తిగత ఆలోచనలను పంచుకున్నారు. సదరు కార్యక్రమంలో మాతృత్వం గురించి ప్రస్తావిస్తూ.. తల్లి కావడానికి తప్పనిసరిగా వివాహం చేసుకోవాల్సిన అవసరం ఉందా అనే ప్రశ్నకు శ్రుతిహాసన్ స్పందించారు. ప్రస్తుతం సమాజంలో తల్లిగా మారేందుకు శాస్త్రీయంగా అనేక మార్గాలు అందుబాటులో ఉన్నాయని, పిల్లలను దత్తత తీసుకోవడానికి కూడా తాను పూర్తి సుముఖంగా ఉన్నానని వెల్లడించారు. అలాగే తన జీవన విధానంలో భాగంగా సహజ సిద్ధమైన మార్గంలోనూ మాతృత్వాన్ని పొందాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.